## గజ వాహనంపై కొలువైన స్వర్ణగిరీశుడు



గజ వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరి మహాక్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు ఆదివారం ఉదయం వేంకటేశ్వర స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యారాధనలు పూర్తి చేశారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు ద్వారతోరణ పూజ నిర్వహించి యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం ఇష్టి యాగశాలలో లోకక్షేమార్థం రాష్ట్రాభివృద్ధి కోసం పరమేష్టి ఇష్టి హవనాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారు గజ వాహనంపై కొలువు దీరారు. ఆలయ తిరు మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. నవ వరుడిగా అలంకృతుడైన స్వామివారి రాజసాన్ని దర్శించి భక్తులు మంత్రముగ్ధులయ్యారు. అంతకుముందు ఉదయం స్వామివారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించారు.

## గుట్టలో మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 23 : యాదగిరి గుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం అనుబంధంగా కొనసాగుతున్న పర్వతవర్ధినీ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలకు ఆలయ పూజారులు ఆదివారం ఉదయం శ్రీకారం చుట్టారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో తొలి రోజు ఉదయం 10గంటలకు స్వస్తీవాచనం నిర్వహించారు. విశ్వశాంత్యర్థం ఈ వేడుక నిర్వహిస్తారు. స్వస్తీవాచనంతో లోకంలోని సర్వవిఘ్నాలు, సర్వవిధ దోషాలు తొలగి ఈశ్వర అనుగ్రహం కలుగాలని, శైవాగమ సాంప్రదాయ రీతిలో ఈ వేడుకను జరిపించారు. అనంతరం ఉత్సవాలలో జరుపబడే సర్వ కార్యాలు నిర్విఘ్నంగా జరిగేలా అనుగ్రహించమని విఘ్నాధిపతి, సకల విఘ్న వినాశకుడైన విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తూ ఆరాధన జరిపించారు. శుద్ధమైన, పవిత్రమైన జలంతో వేదమంత్ర పఠనంతో పూజ ద్రవ్యాలను ఆలయ పరిసర ప్రాంతంలో ప్రోక్షణ గావించి శుద్ధి పుణ్యాహవచనం చేపట్టారు. మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా పరమేశ్వర అనుగ్రహంతో సక్రమంగా నిర్వహింపబడాలని ఏ విధమైన ఈతిబాధలు కలుగకూడదని శాస్త్రోక్తంగా రక్షబంధనాలు పూజాధికాలు నిర్వహించారు. సాయంత్రం పారాయణికులతో నమక, చమక పారాయణాలు, మంత్రపుష్ప పఠనం, అంకురారోపణం, సోమకుంభ, కలశస్థాపన, దేవతారాధన వంటి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

## పేరుకు కిరాణం.. అమ్మేది మద్యం

- గ్రామాల్లో బెల్ట్ షాపుల జోరు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 23 : పల్లెల్లో బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా గ్రామాల్లో మద్యం విక్రయాలు మాత్రం ఆగడం లేదు. పేరుకే కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మద్యం వ్యాపారం చేస్తున్నారు. ఇళ్లల్లో పెద్ద పెద్ద ఫ్రిడ్జ్‌లు ఏర్పాటు చేసుకొని బీర్లు విక్రయిస్తున్నారు. మద్యం అందుబాటులో ఉండడంతో అర్ధరాత్రి వరకు తాగి చాలా మంది ఇళ్లల్లో గొడవలు పడుతున్నారు. యువకులు వీధుల్లో నానా రభస చేస్తున్నారు. మండలంలోని రేవణపల్లి, ముక్తాపూర్, జగత్‌పల్లి, కప్రాయిపల్లి, ఇంద్రియాల, శివారెడ్డిగూడెం, వంకమామిడి, జిబ్లక్‌పల్లి, దోతిగూడెం, పోచంపల్లి గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించేవారు ఒక్కో క్వాటర్, బీరుకు 20 రూపాయలు అదనంగా తీసుకుంటున్నారు. గ్రామాల్లో యథేచ్ఛగా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నా ఎక్సైజ్, సివిల్ పోలీసులు పట్టించుకోవడం లేదని, మామూళ్ల మత్తుతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకొని గ్రామాల్లో మద్యం విక్రయాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఎమ్మెల్సీ గారూ.. ఇచ్చిన హామీ ఏమైంది?

రాజాపేట, ఫిబ్రవరి 23 : 'రేపటి నుంచే సరిపడా సురక్షిత మంచినీరు అన్నారు. రెండు నెలలు గడిచినా ఆ ఊసే లేదు. ఎమ్మెల్సీ గారూ.. ఇచ్చిన హామీ ఏమైంది' అని ప్రశ్నిస్తున్నారు రాజాపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు. ప్రభుత్వం విద్యార్థులకు పెంచిన మెనూ ప్రారంభోత్సవానికి డిసెంబర్ 14న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాజాపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో తరగతి గదులు, వంటశాల, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఈ క్రమంలో వాటర్ ప్లాంట్ కెపాసిటీని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొని అదనంగా మరో 500 లీటర్ల వాటర్ ప్లాంట్‌ను రెండ్రోజుల్లో తమ వాళ్లు బిగిస్తారని హామీ ఇచ్చారు. దాంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు చప్పట్లతో ఎమ్మెల్సీకి అభినందనలు తెలిపారు. కానీ.. ఆ హామీ ఇచ్చి రెండు నెలలు అవుతున్నా వాటర్ ప్లాంట్ ఊసే లేదు.

ఈ గురుకుల పాఠశాలకు తనకు మంచి అనుబంధం ఉందని, ఇందులోనే ఎలక్ట్రికల్ వర్క్ చేశానని చెప్పిన ఎమ్మెల్సీ మల్లన్న వాటర్ ప్లాంట్ బిగించడం ఎందుకు మరిచారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

## బస్వాపురం గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా భిక్షపతి



బస్వాపురం గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులను అభినందిస్తున్న గీత కార్మికులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : మండలంలోని బస్వాపురం గ్రామ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మచ్చ భిక్షపతి ఎన్నికయ్యారు. ఎక్సైజ్ కో ఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ దశరథ ఆధ్వర్యంలో గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దూసరి మైసయ్య, కార్యదర్శిగా బొజ్జ బాలనర్సింహ, కోశాధికారిగా మచ్చ వెంకటనర్సయ్య, డైరెక్టర్లుగా బబ్బూరి రాములు, మచ్చ భిక్షపతి, మచ్చ బాలయ్య, మచ్చ భాస్కర్, రాంపల్లి భాస్కర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భిక్షపతి మాట్లాడుతూ గ్రామంలోని గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పాటుపడుతానన్నారు. అనంతరం కార్యవర్గాన్ని బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

రామన్నపేట, ఫిబ్రవరి 23 : మండలంలోని ఇంద్రపాలనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనర్సింహారావు, పద్మయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, భిక్షపతి, కౌసల్య, నరహరి, వెంకయ్య, జనార్దన్, రజాక్, కృష్ణమూర్తి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## నార్కట్‌పల్లిలో చికెన్ మేళా

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 23 : బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా కోళ్లు చనిపోతున్నాయనే ప్రచారంతో చికెన్ కొనుగోళ్లు భారీగా తగ్గాయి. అయితే చికెన్ తినడం వల్ల ఎలాంటి నష్టం ఉండదని ప్రజలకు తెలిపేందుకు ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ కాంప్లెక్స్ వద్ద వెన్‌కాబ్ ఆధ్వర్యంలో చికెన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా 200 కిలోల చికెన్, 2వేల బాయిల్డ్ కోడి గుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ కోళ్లకు వచ్చే రోగమని, వండిన చికెన్ తింటే మనకు ఎలాంటి నష్టం ఉండదని అన్నారు.

# చేనేత సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యేలకు చేనేత నాయకుల వినతి



ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతి పత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 23 : చేనేత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం నాయకులు హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి, నకిరేకల్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశాన్ని ఆదివారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. చేనేత పొదుపు పథకంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా చేరడానికి అవకాశం కల్పించాలని కోరారు. చేనేత పొదుపు పథకంలో జియో ట్యాగ్ కలిగిన వీవర్‌తో పాటు ఇద్దరు అనుబంధ కార్మికులకు అవకాశం ఉండేదని తెలిపారు. ప్రస్తుతం నిబంధనల పేరుతో రూ.800 చెల్లించే కార్మికులను తొలగించారని అన్నారు. గతంలో మాదిరిగా అనుబంధ కార్మికులను తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో రాష్ట్ర చేనేత నాయకులు తడక వెంకటేశ్, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తూరి భిక్షపతి, నాయకులు బొమ్మ హరిశంకర్, బిట్ల గణేశ్, రుద్ర సూర్యప్రకాశ్, కటకం శ్యాంసుందర్, గుర్రం హేమలత పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగి తీగ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను కింద పడేసిన దుండగులు

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 23 : పట్టణంలోని రామసముద్రం సమీపంలో మొరిగాడి మల్లేశం బావి వద్ద శనివారం రాత్రి దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగి తీగ చోరీ చేశారు. మల్లేశం ఆదివారం ఉదయం బావి వద్దకు వెళ్లి మోటారు పెట్టగా పని చేయకపోవడంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూశాడు. ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి ఉండడం గమనించి చుట్టుపక్కల రైతులకు చెప్పాడు. రాగి తీగ చోరీ అయినట్లు గుర్తించిన రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వరి పైరు ఎండిపోయే పరిస్థితి ఉన్నదని, త్వరగా మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని బాధిత రైతులు విద్యుత్ అధికారులను కోరారు.

## బాల్య స్నేహితుడికి ఆర్థిక సాయం



రామచంద్రును పరామర్శిస్తున్న స్నేహితులు

మోత్కూరు, ఫిబ్రవరి 23 : మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడేనికి చెందిన జిట్ట రామచంద్రు దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. రామచంద్రు దంపతులను వారి బాల్య స్నేహితులు ఆదివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన బ్యాచ్‌మేట్స్ 32,116 రూపాయలు జమ చేసి అందజేశారు. కార్యక్రమంలో పోచం శ్రీనివాస్, వాసం ప్రసాద్, ఆరె శ్రీనివాస్, చందు, మెరుగు రాజశేఖర్, వెంకటరమణ, జిక్కి, తిరుమలేశ్, రోజా, సత్యనారాయణ రెడ్డి ఉన్నారు.

## ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్



సింగారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 23 : నీళ్లు లేక ఎండిపోయిన పంటలను వ్యవసాయ శాఖ అధికారులతో సర్వే చేయించి పంటలు నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందివ్వాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని సింగారంలో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ కోతలు, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చేతికొచ్చిన వరి పంటలు ఎండిపోతున్నాయన్నారు. గోదావరి జలాలను విడుదల చేస్తున్నామని అట్టహాసంగా ప్రచారం చేస్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రచారానికే పరిమితమయ్యారని పేర్కొన్నారు. మండలంలోని బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లలో చుక్క నీరు కూడా లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునేందుకు గోదావరి జలాలతో మండలంలోని అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపాలని సూచించారు. అదేవిధంగా రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి రైతుభరోసా అందివ్వాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు బాషబోయిన ఉప్పలయ్య, మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, నాయకులు అరుణ, దశరథగౌడ్, సత్యనారాయణ, శంకర్, రాంరెడ్డి, శ్రీహరి, పరశురాములు, లక్ష్మీనారాయణ, మైసయ్య, యాదగిరి, శంకర్, రాంరెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

## బావను మోసం చేసిన బావమరిది

- నమ్మించి రెండెకరాల భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న బావమరిది



విలేకరులతో మాట్లాడుతున్న బాధితుడు కొమురయ్య

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 23 : బావ అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని అతని పేరు మీద ఉన్న రెండెకరాల వ్యవసాయ భూమిని బావమరిది కాజేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని రాయిపల్లి గ్రామానికి చెందిన జట్ట కొమురయ్యకు మతిస్థిమితం సరిగా లేదు. కొమురయ్యకు తండ్రి నుంచి రెండెకరాల వ్యవసాయ భూమి సంక్రమించింది. ఇదిలాఉండగా.. 2024 నవంబర్ 17న కొమురయ్య భార్య సావిత్రి, అదే నెల 30న కొడుకు నరేశ్ 15రోజుల తేడాతో అనారోగ్యంతో మృతిచెందారు. ఈ క్రమంలో కొమురయ్య అత్తగారు ఊరు అయిన మోటకొండూర్‌కు నిద్ర చేయించడానికని ఆయన బావమరిది భూమండ్ల మల్లేశ్ 2024 డిసెంబర్ 12న తీసుకుపోయాడు. కొమురయ్య వారం రోజులపాటు అత్తగారి ఇంట్లోనే ఉన్నాడు. బావ అమాయకత్వాన్ని అలుసుగా తీసుకున్న బావమరిది మల్లేశ్ మాయమాటలు చెప్పి 2024 డిసెంబర్ 19న ఆత్మకూరు(ఎం) తాసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి ఆయన పేరున ఉన్న రెండెకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ వెంటనే బావను తీసుకొని మళ్లీ మోటకొండూర్‌కు వెళ్లాడు. కొమురయ్య తల్లి జట్ట మల్లమ్మ ఈ నెల 9న మృతిచెందగా.. దహన సంస్కారాల కోసం ఆయన రాయిపల్లికి వచ్చాడు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులతో తన బావమరిది మల్లేశ్ తనను మోసం చేసి రెండెకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని కొమురయ్య చెప్పాడు. కొమురయ్య తమ్ముడి పిల్లలకు తన ఆస్తి చెల్లుతుందనే అక్కసుతో భూమిని కాజేశాడని అతని బంధువులు ఆరోపించారు. దొంగతనంగా భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న మల్లేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు తన భూమి తనకు ఇప్పించాలని బాధితుడు కొమురయ్య అధికారులను కోరాడు.

## సజావుగా గురుకుల ఎంట్రన్స్



మోత్కూరు గురుకుల పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రామన్నపేట, ఫిబ్రవరి 23 : గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు మండలంలోని జనంపల్లి గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 192 మంది విద్యార్థులకు గాను 191 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ రాజా పరీక్షలను పర్యవేక్షించారు.

మోత్కూరు : గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం మున్సిపాలిటీలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 233 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 232 మంది పరీక్ష రాసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ ఐ.శారద, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ ఎం.స్వాతి తెలిపారు.

రాజాపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన టీజీ ఎంట్రన్స్ ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ వేణుప్రసాద్ తెలిపారు. 253 మంది విద్యార్థులకు 232 మంది హాజరయ్యారని చెప్పారు.

## విరబూసిన కాగితపు పూలు



మండల పరిషత్ కార్యాలయంలో విరబూసిన కాగితపు పూల చెట్టు



గులాబీ తివాచీల నేలపై పరుచుకున్న రాలిన కాగితపు పూలు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణకు హరితహారంలో భాగంగా వివిధ రకాల పూల మొక్కలు నాటారు. ఇప్పుడవి పెద్దగా ఎదిగి పూలు పూస్తున్నాయి. ఈ క్రమంలో పింక్ కలర్‌లో ఉన్న కాగితపు పూల చెట్టు విరబూసి ఆకర్షిస్తున్నది. చెట్టు నుంచి రాలిన పూలు నేలపై పరిచిన గులాబీ రంగు తివాచీలా ఆకట్టుకుంటున్నాయి.

## అఖండ జ్యోతి రథయాత్ర కరపత్రం ఆవిష్కరణ



అఖండ జ్యోతి రథయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌రెడ్డి, వీరేశం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 23 : యాదగిరిగుట్ట ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే లక్ష్మీనర్సింహస్వామి 31వ అఖండ జ్యోతి రథయాత్ర కరపత్రాన్ని పట్టణంలో భువనగిరి, నకిరేకల్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖండ జ్యోతి రథయాత్ర భువనగిరి సభ్యులు శెట్టి బాలయ్య, పక్కీర్ కొండల్‌రెడ్డి, దేవరకొండ నర్సింహాచారి, నర్సింగరావు, సత్యనారాయణరెడ్డి, విశ్వేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## పరిపాలనలో కాంగ్రెస్ సర్కారు విఫలం

- మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్



వేబ్రిడ్జిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

బొమ్మలరామారం, ఫిబ్రవరి 23 : రాష్ట్రాన్ని పాలించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు రాగుల బలరాం కొత్తగా ఏర్పాటు చేసిన వేబ్రిడ్జిని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం వెనుకడుగు వేస్తుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మచ్చ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు జూపల్లి భరత్, నవీన్‌గౌడ్, మేడబోయిన గణేశ్, కుర్మిండ్ల దామోదర్‌గౌడ్, మల్లారెడ్డి, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## 'సీపీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి'



పిలాయిపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 23 : మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో మార్చి 1, 2 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా శిక్షణ తరగతులు, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. బహిరంగ సభ విజయవంతం కోసం మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికులు, చేతివృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తూ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. ఆనాడు భూస్వామి వ్యవస్థకు, రజాకార్లకు వ్యతిరేకంగా దున్నేవాడికి భూమి కావాలని, గీసే వారికే చెట్టు కావాలని, వెట్టి చాకిరి పోవాలని పోరాడింది ఎర్రజెండా అని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధితోపాటు మూసీ ప్రక్షాళన, గోదావరి జలాల సాధన పూర్తి కోసం క్లాసుల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ చేపడుతామని అన్నారు. బహిరంగ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరవుతారని, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, గూడూరు బుచ్చిరెడ్డి, శాఖ కార్యదర్శి పత్తి భిక్షపతి, అందెల యాదగిరి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి : బీఆర్ఎస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సోమిరెడ్డి

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 23 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ దొంతిరి సోమిరెడ్డి అన్నారు. మండలంలోని కొలనుపాకలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14నెలలు అయినా హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జంగ స్వామి, మాజీ ఎంపీటీసీ మామిడాల అంజయ్య, నాయకులు బాశెట్టి రాజు, బైరి కాలేందర్‌గౌడ్, రాజబోయిన కొండల్, జహంగీర్ పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి : డాక్టర్ రాజ్‌కుమార్



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : ఆరోగ్యం విషయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. పల్లె పల్లెకూ వైద్యం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొల్లెపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆరోగ్యం విషయంలో అజాగ్రత్తగా ఉండవద్దని, సరైన ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అనంతరం వైద్య శిబిరానికి వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో గోద సంపత్‌కుమార్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంద్రియాలలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 22 : మండలంలోని ఇంద్రియాల గ్రామంలో బోధి ధర్మ యోగా కమిటీ ఆధ్వర్యంలో మాతృశ్రీ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్, దేవాలయ కమిటీ చైర్మన్ చింతల రామకృష్ణ, నాయకులు నారాయణ, బుచ్చిబాబు, రాజశేఖర్, జంగయ్య పాల్గొన్నారు.